


# సర్వం శ్రీ జగన్నాథం

**మా** ఊళ్ళో భ్రమరాంబ గారుంది. ఆవిడ వయసెంతో ఆవిడకే తెలియదు. కాకి లెక్కలు వేసి తీసిందేమిటీ అంటే తాతయ్యగారికంటే కూడా చాలా చాలా పెద్దదిట. అంటే ఎనభై పైనే.

మంచినీళ్ళ బావినుంచి మంచినీళ్ళు తెచ్చి పొయ్యడం ఆవిడ వృత్తి. చంకలో ఓ బిందె, చేతిలో ఒక కడవతో తెచ్చి పోస్తుంది. 'ఆవిడ శరీరం మానవ శరీరం మాత్రం కాదు. వేరే ఏదో వింత పదార్థంతో చేశాడు దేవుడు' అంటుంటారు నాన్నగారు.

మండే వేసవికాలం అయినా, హోరున కురిసే వర్షంలో అయినా, గడగడలాడించే చలికాలంలో అయినా తడి బట్టలు కట్టుకుని తొణక్కుండా నీళ్ళు తెచ్చి పోస్తుంది. పది ట్రిప్పులైనా తిరుగుతుంది.

ఈ పనికాక ఇంకే పని కావాలన్నా చేసి పెడుతుంది. వయసునిబట్టి 'మామ్మా' అని పిలిస్తే ఆవిడక్కోపం. 'అక్కయ్యా అని పిలవండి' అంటుంది. తాతయ్యగారికీ నాకూ కూడా ఆవిడ భ్రమరాంబక్కయ్యే.

ఓరోజు ఏడ్చుకుంటూ తాతయ్య దగ్గరికి వచ్చింది భ్రమరాంబక్కయ్య. వెంట వయసుమళ్ళిన దంపతులున్నారు. ఆవిడ చెల్లెలు సీతారావమ్మ, చెల్లెలి భర్త సీతారామయ్య. వాళ్ళకి రోజులు గడవక అక్కని వెతుక్కుంటూ వచ్చారు. నీదే భారం అంది తాతయ్యతో.

అందరితో చర్చించి వాళ్ళకి బతుకుతెరువు ఏర్పాటుచేశారు తాతయ్య. సీతారామయ్య గొడ్డులా పనిచేసేవాడు. కావిడితో నీళ్ళు మొయ్యడం, వంటలు చెయ్యడం, పొరుగూరెళ్ళి రావడం-ఒకటేవిటి ఎవరేది చెప్తే అది చేసేవాడు.

ఇక సీతారావమ్మ... ఆవిడకే పనీ రాదు. పాటలు పాడుతుంది. గొంతు కూడా అంత శ్రావ్యంగా ఏమీ ఉండదు. ఏదో పాడుతుంది అంతే. పొద్దున్నా సాయంత్రం గుళ్ళో దేవుడి దగ్గర పాటలు పాడమని చెప్పారు తాతయ్య. రెండు బస్తాల ఒడ్లు కాలిచేట్లు ఒప్పందం.

ఆవిడకి రెండే చీరలుండేవి. అవే మార్చిమార్చి కట్టుకునేది.

ఆదివారం సూర్యుడికీ, సోమవారం శివుడికీ, మంగళవారం ఆంజనేయస్వామికీ ఇట్లా వారం అంతా ఒంటి పొద్దులుండేది. చుక్క పొడవగానే భోజనం చేసేది.

రెండుపూటలా దేవుడి గుడిలో కూర్చుని పాటలు పాడేది. అసలే అంతంత మాత్రం కంఠం. పొద్దున నీరసంతోనూ సాయంత్రం భుక్తాయాసంతోనూ పాడటంతో ఆ పాటలు కర్ణకఠోరంగా తయారయ్యేవి.

మొదలుపెట్టడం బాగానే మొదలుపెట్టేది. కానీ పల్లవిదాటి చరణం అందుకునేసరికి తడబడిపోయేది. 'సీతాపతే రామ, రాధాపతే క్రిష్ణ శ్రీ రుక్మిణీ సత్యభామా పతే' అని భజన మొదలుపెట్టి కళ్ళు మూసుకుని పాడుతూ క్షాసేపటికే తడబడిపోయేది. 'సీతాపతే క్రిష్ణ' అంటూ పాడేది.

అటుగా వచ్చిన పూజారిగారు "సీతారావమ్మా! ఏవిటా అయోమయం? కాస్త ఒంటిమీద తెలివి తెచ్చుకుని మరీ పాడు. దేవుళ్ళూ, భార్యలూ అటూఇటూ అయిపోతున్నారు" అని మందలిస్తే టపటపా లెంపలు వేసుకునేది. 'అపచారం అపచారం' అనుకుని మళ్ళీ పాడేది కానీ అదే వరస.

'వసుదేవాత్మజ రామ జయ జయ' అని ఒకసారీ 'కైలాసవాసా

శ్రీహరీ ననుకానగ రారా శ్రీహరీ' అంటూ మరోసారి పాడి అందరిచేతా చీవాట్లు తినేది.

"కాళిదాసుగారి కవిత్వం కొంత, నా పైత్యం కొంత అని దీని తెలివితేట లొకటి. ఆ పాటలు విన్లేక చచ్చిపోతున్నాం" అని విసుక్కునేది అమ్మమ్మ.

"పోనీ పాటలు మానేసి పిల్లలకి పద్యాలు నేర్పించు" అన్నారు తాతగారు.

ఆ పద్యాలూ అంతే. అయోమయం, అర్థాంతరన్యాసం 'ఉపకారికి అపకారము నెపమెన్నక చేయువాడు' అంటూ నేర్పితే పిల్లలు అదే వల్లె వేస్తుంటే పెద్దవాళ్ళు లబోదిబోమని మొత్తుకున్నారు.

ఇంకేపనీ రాదు. 'పోనీ ఏ పనీ వద్దు. ఇంటిపట్టున ఉండి 'రామా క్రిష్ణా' అనుకో' అంటే అభిమానపడి ఏడిచింది. జాలివేసి 'సరే ఏదో ఏడు' అన్నారు ఊరిపెద్దలందరూ. మళ్ళీ గుళ్ళోపాటలు మొదలుపెట్టింది.

ఆ రోజుల్లోనే వానలుపడక కరువు వచ్చింది. అందరూ ఆలోచించి వరుణ యాగం చేయించారు. ఘనంగా జరిగింది వరుణయాగం. ఆ క్రతువు మొదలుపెట్టిన దగ్గర్నించి పూర్తయే దాకా సీతారావమ్మ పాటలు పాడుతూనే ఉంది.

సామాన్యంగా వరుణయాగం చేయిస్తే భోజనాలు అయేసరికి వాన కురవాలిట. కురవలేదు. చుట్టుపక్కల ఊళ్ళల్లోనూ ఈ ఋత్విక్కులూ ఈ పండితులే యాగం చేయించారుట. మంచి వర్షాలు పడ్డాయిట.

నాలుగు రోజులయింది. చినుకు రాల్లేదు. ఊళ్ళో ఎక్కడ విన్నా ఇదే చర్చ. ఎందుకిలా జరిగింది? ఎందుకింత పగబట్టాడు ఆ దేవుడు? వాన కురవకపోతే ఎట్లా? ఏ విధంగా ఆలోచించినా కారణం ఒక్కటే కనిపిస్తోంది.

'పరోపకారం' అంటూ ఆ పిచ్చి మేళాన్ని తెచ్చి గుళ్ళో కూచోబెట్టారు. దాని పిచ్చి పాటలు వినలేక దేవుడు గుడొదిలి పారిపోయి ఉంటాడు. ఇక ఎన్ని యాగాలు చేయించినా ఏం ఫలితం అన్నారందరూ.

అది విని సీతారావమ్మ అక్కుళ్ళు బుక్కుళ్ళుగా ఏడిచింది. పొద్దున్నే తల స్నానం చేసి గుళ్ళోకి పోయి దేవుడి ఎదురుగా కూర్చుంది. 'గణేశ శరణం' భజన మొదలుపెట్టింది. పాట వెనక పాట-పగలంతా పాడుతూనే ఉంది. తిండి కూడా అటుంచి ఆవిడచేత గుక్కెడు నీళ్ళు తాగించటం ఎవరివల్లా కాలేదు.

సాయంత్రం అయింది. నీరసంగా పెగలని గొంతుతో 'రావణసంహార క్రిష్ణ నమో, కంస సంహార రామ నమో' అని.

'పన్నగ భూషణ పార్వతినాయక, పండరీపురమును విడచీ రారా' అని పాడుతూనే ఉంది.

'ఇక లాభంలేదు. ఇది మొండికి పడింది. దేహశుద్ధి చేసి ఊళ్ళోంచి వెళ్ళగొట్టాల్సిందే" అని తీర్మానించారు కొందరు.

"చీకటి పడింది, రేపు తెల్లారాక చూద్దాం" అన్నారు తాతయ్య.

రాత్రి పది గంటలకి గాలి బంధించింది. చందమామను కప్పేస్తూ మబ్బులు. కారు చీకటి. అర్థరాత్రి జల్లు మొదలయింది. కుంభవృష్టి. మర్నాడు సాయంత్రం దాకా ఆగకుండా కురిసింది వర్షం. ఎక్కడ చూసినా నీళ్ళే. అందరి ఆనందం అంతా ఇంతా కాదు.

'పోన్లే ఆ పిచ్చిదాని పరువు దక్కింది. అయినా మనం పెట్టుకున్న పేర్లేగానీ సర్వం శ్రీజగన్నాథం' అన్నారు తాతయ్య తృప్తిగా.

* * *